క్లుప్తంగా

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన వేజళ్ళ వెంకటేశ్వరరావు, ఎస్‌కె.షకీనాబీ, అనుమోలు రాధమ్మ, మిట్టపల్లి లక్ష్మి, ముచ్చర్ల బతుకమ్మ, పోల కోటమ్మ, బత్తుల నగేష్, దోమకొండ నర్సింహ మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్, అపోలో, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండకు చెందిన జంగా నాగేశ్వరరావు అలియాస్ మధు (24) బంధువులతో తగాదా నేపథ్యాన ఈనెల 2న నాచేపల్లిలోని బంధువుల ఇంటి వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో ఆయనకు ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మధుకు భార్య, ఓ కుమార్తె ఉండగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రధానికి మేయర్ లేఖ

ఖమ్మంమయూరిసెంటర్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే అంశం ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నందున అమలుచేయాలని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆమె ప్రధాని మోదీకి లేఖ పంపించారు. రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మహిళల రిజర్వేషన్ల విషయంలో అడుగు ముందుకు వేయలేదని, ఇకనైనా తక్షణమే బిల్లును ఆమోదించాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు.

బోరు ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: అవామి హింద్ వెల్ఫేర్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హఫీజ్ జవ్వాద్ ఆధ్వర్యంలో స్థానిక వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల మసీదు ఉమర్ ఇబ్బదుల్ ఖత్తార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోరును పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నగర అధ్యక్షుడు ఎండీ జావిద్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలి

ఖమ్మంరూరల్: ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలని టీఆర్‌టీఎఫ్ జిలా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గట్టిగుండ్ల దుర్గయ్య, కట్టా అనిల్‌కుమార్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో ఈఎంఐలు, నిత్యావసరాలు కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచనా ధోరణి విడనాడి వేతనాలు సకాలంలో అందించాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి వితరణ



వితరణ అందజేస్తున్న దాత మదన్‌కుమార్

ఖమ్మంఅర్బన్: శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునఃనిర్మాణంతో పాటు ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణానికి కమిటీ బాధ్యులు శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా శుక్రవారం కొనసాగుతున్న నాల్గో రోజు జాతర వేడుకల్లో పాల్గొన్న దోరేపల్లి మదన్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నాక ముత్యాలమ్మ దేవాలయం నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని చెప్పినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ భాస్కర్ తెలిపారు. అమ్మవార్ల జాతర శనివారంతో ముగుస్తున్నందన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	40	చుక్కకూర	2
బోడ కాకర	45		10
బీర	56	తోటకూర	2
దొండ	48		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	76		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	14		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	64	పుదీన	1
క్యారెట్	26		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

అరవై దాటినా.. ఆర్థిక భరోసా

కొత్త సంఘాల ఏర్పాటుకు రాష్ట్రం కసరత్తు

- వృద్ధ మహిళలకు మళ్లీ అవకాశం
- గతంలో మాదిరి తొలగింపునకు ఇక స్వస్తి
- డివిజన్ వ్యాప్తంగా సర్వే షురూ
- గ్రామాలు, మండలాల వారీగా జాబితా తయారీ



స్వయం సహాయక సంఘాల సమావేశంలో సభ్యులు(ఫైల్)

నేలకొండపల్లి : గ్రామీణ పేద మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించేందుకు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారు. కాగా, దానిలో 60 ఏళ్లు దాటిన వారిని వయస్సు నిబంధన కారణంగా పక్కన పెడుతున్నారు. రుణాలు సక్రమంగా చెల్లించినా.. వారికి తిప్పలు తప్పడం లేదు. ఇది గుర్తించిన ప్రభుత్వం తాజాగా వృద్ధులకు ప్రత్యేకంగా సంఘాలు ఏర్పాటు చేయాలని భావించి వృద్ధ మహిళల గుర్తింపు ప్రక్రియ చేపట్టి సర్వే మొదలుపెట్టింది. ఈ సర్వే ద్వారా మహిళా సంఘాలు, వృద్ధ మహిళా సంఘాలు, దివ్యాంగుల మహిళా సంఘాలు ఏర్పాటు చేసి వృద్ధ మహిళలకు మళ్లీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో పాలేరు నియోజకవర్గంలో సర్వే నిర్వహిస్తోంది.

సంఘానికి పది మంది సభ్యులు..

జాతీయ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు ప్రతి పల్లెలో 60 ఏళ్లు నిండిన మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్చుతారు. మొదటగా పొదుపు ప్రక్రియపై అవగాహన కల్పించి, స్వయం సహాయక సంఘాలకు చెందిన యాప్‌లో గ్రూపుకు పది మంది చొప్పున పేర్లు నమోదు చేసి బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తారు. ఇతర సంఘాల మాదిరిగా గ్రూపు సమావేశాలతో పాటు సభ్యుల కోరిక మేరకు పొదుపు చేసే వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటారు. ఇదివరకే వేరే సంఘంలో ఉండి వయస్సు నిండితే వారిని ఆ గ్రూపుల నుంచి తొలగించి వృద్ధుల సంఘాల్లో చేరుస్తారు. ఎక్కడైనా సభ్యులు మరణించినా, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా గ్రూపులో మరో సభ్యురాలిని చేర్చేలా కంప్యూటర్‌ను అనుసంధానిస్తారు. మెరుగైన ప్రతిభ చూపుతున్న సంఘాలకు గ్రేడింగ్ కూడా యాప్‌లో కల్పిస్తారు. మహిళల పొదుపు రుణాలు హాజరు, నెలవారి సమావేశాలు, నిర్వహణ రికార్డులు అమలు, రుణాలు చెల్లింపులు నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

కొనసాగుతున్న కసరత్తు..

పాలేరు డివిజన్‌లో స్వయం సహాయక సంఘాల పరిధిలో 60 ఏళ్లు నిండిన వారు దాదాపు వందల సంఖ్యలో ఉన్నారు. సంఘాల నుంచి అర్హత కోల్పోయే వారిని గుర్తించారు. ఇప్పటి వరకు 20 సంఘాల వరకు గుర్తించినట్లు తెలుస్తుంది. పాలేరు డివిజన్‌లో కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల నుంచి వేలాది మందిని ఇంకా గుర్తించాల్సి ఉంది. 50 సంఘాల వరకు పాలేరు డివిజన్‌లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం..



స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి.. వయస్సు నిబంధన కారణంగా రుణ అర్హత కోల్పోతున్న వారిని గుర్తించే ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తించిన వారి వివరాలు ఏర్పాటు తర్వాత వారి ఆర్థిక పురోభివృద్ధి తోడ్పాటు ప్రక్రియ ఉండనుంది.

– కె.అశోక్‌రాణి, ఏపీఎం, నేలకొండపల్లి

అందరికీ అవకాశం కల్పించాలి..



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 60 ఏళ్లు దాటిన ప్రతీ మహిళకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసేందుకు తిరిగి సభ్యులుగా చేర్చుకోవడంతో వారి జీవితానికి భరోసా ఉంటుంది. సర్వే సమగ్రంగా నిర్వహించి అందరికీ అవకాశం కల్పించాలి.

– కె.విజయలక్ష్మి, సర్పంచ్, పైనంపల్లి

సభ్యులుగా చేర్చడం సంతోషం..



నిబంధనలకు ప్రకారం వయస్సు దాటిన వృద్ధులకు తిరిగి సంఘం ఏర్పాటు చేయటం చాలా సంతోషం. వృద్ధులకూ ఆర్థిక వెసులుబాటు ఉండాలంటే సంఘంలో ఉండాలి. పొదుపు, రుణాలు తీసుకోవటం చేసుకుంటారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వృద్ధులకు చాలా ఉపయోగం.

– అచ్చమ్మ, అనంతనగర్, మాజీ సభ్యురాలు

రుణమాఫీ వెంటనే అమలు చేయాలి



ఖమ్మంలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: రైతుల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్రప్రదీప్, నున్నా రవికుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అర్బన్ ఎంఆర్‌ఓ కార్యాలయం ఎదుట, నేలకొండపల్లి మండల కేంద్రంలో రైతుల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని తెలిపారు. తెలంగాణను పూర్తిగా దోచుకుని, దేశాన్ని దోచుకునేందుకు కొత్త అవతారం ఎత్తాడని విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని, ధరణి పోర్టల్ లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడుడు చావా కిరణ్, మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, షర్ఫోద్దీన్, దుర్గారావు, కోటి హనుమంతరావు, మన్నె రాధాకృష్ణ, అప్పారావు, లక్ష్మయ్య, అంజయ్య, ఉపేందర్ గౌడ్, వెంకట్, భద్రం, వీరస్వామి, రాజేష్, చంద్రశేఖర్, కొటయ్య, కాశంగి వెంకటేశ్వర్లు, గోవింద్, రామకృష్ణ, రమణ, మోహీనుద్దీన్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కాల్వొడ్డు మదర్సా ఇస్లామియా దారుల్ ఉలుమ్ ఆధ్వర్యాన నేడు(శనివారం) మోతీ మసీదులో సాయంత్రం నిర్వహించే ధార్మిక భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మదర్సా వైస్ చైర్మన్ ఎండీ జవ్వాద్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదర్సా ఇస్లామియా ఇందాదుల్ ఉలుమ్ ఖమ్మం నిర్వాహకులు మౌలానా హఫీజ్ ఎండీ జలాలుద్దిన్ ఖాస్మీ, దారుల్ ఉలుం మదర్సా కరస్పాండెంట్ మౌలానా సయిూద్ అహ్మద్ ఖాస్మీ అధ్యక్షతన జరిగే ఈ సభకు విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ హదీస్ మౌలానా అహ్మద్ ఉబైదుర్ రెహమాన్ అతర్ ఖాస్మీ, ఆల్ ఇండియా ప్రెసిడెంట్ సఫా బైతుల్ మాల్ మౌలానా ఎండీ గయాస్‌అహ్మద్ రషదీలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా చైతన్య యాత్ర సభ..

తిరుమలాయపాలెం: ఈ నెల 24న తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ప్రజా చైతన్య యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ యాత్ర సాగుతుందని తెలిపారు. హన్మకొండలో 17న ప్రారంభమై 24న తిరుమలాయపాలెం చేరుతుందని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, అంగిరేకుల నర్సయ్య, బింగి రమేష్, వెంకట్రామిరెడ్డి, కోట ఉపేందర్‌రెడ్డి, స్వామి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మనువాదం అమలుకు బీజేపీ ప్రయత్నాలు

ఖమ్మంరూరల్: మనువాదాన్ని అమలు చేసేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని జలగంనగర్‌లో శుక్రవారం జరిగిన కేవీపీఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో మార్చి 14న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎం.సారయ్య, రమణ, వి.రామనాథం, మునగాల నాగయ్య, నాగేశ్వరరావు, సురేష్, పుల్లారావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలకల పాఠశాలలో నున్నా లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో కస్తూర్బా రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి నగదు పురస్కారం అందుకున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి వై.లత పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌ను తన తండ్రి రాజశేఖర్ పేరుతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బాలికలను విద్యలో ప్రోత్సహించడానికి ఈ ప్రతిభా పరీక్షలను నిర్వహించుతున్నట్లు లక్ష్మణ్‌బాబు తెలిపారు. అనంతరం టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన నవీన, సాత్విక్, తేజశ్రీ, సింధు, శ్రీనిధి, నేహ తదితరులకు నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ ఉదయశ్రీ , నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

కూసుమంచి: జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాల పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సమక్షంలో దేవాదాయశాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ సమత కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్లుగా బూర్లె వీరబాబు, చెన్నా వెంకన్నతో పాటు పాలకమండలి సభ్యులు ఎన్నుకున్నారు. కాగా, వీరిని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభినందించి మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటుందని, నూతన పాలకమండలి సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ వారి సహకారంతో ఆలయాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీ విద్యానికేతన్' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్డీఓ కిషన్‌రావు, పక్కన కరస్పాండెంట్ రాంప్రసాద్,తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీ విద్యానికేతన్ సీబీఎస్‌ఈ పాఠశాల 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ కిషన్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గొల్లపుడి రాంప్రసాద్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే త్వరితగతిన ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్, చైర్మన్ గొల్లపుడి నర్సింహారావు, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ శుక్రవారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కిట్స్'లో అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన హెల్సన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ టెక్నికల్ హెడ్ సతీష్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్‌తో సంబంధం లేకుండా అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ లాట్ రోబోటిక్స్ పుల్లు, కళాశాల ప్రిన్సిపాల్ పి. కృష్ణమూర్తి, హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

నేలకొండపల్లి: రిటైర్డ్ అసిస్టెంట్ ఆర్కియాలజీ డైరెక్టర్ డీఎల్ఎన్ శాస్త్రి రచించిన బౌద్ధ చరిత్ర పుస్తకాన్ని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈ పుస్తకాలను నేలకొండపల్లి గ్రంథాలయానికి అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్, పెండ్యాల శ్రీరామ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు, సొంత జాగా ఉన్నవారికి రూ.5 లక్షలు రుణం ఇవ్వడంతో పాటు స్థానిక సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ఖమ్మం టూటౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పెట్రో ధరలతో పాటు నిత్యావసరాలు విపరీతంగా పెరిగి పేద, మధ్య తరగతికి చెందిన వారిపై మోయలేని భారం మోపారని తెలిపారు. దేశంలో మతోన్మాద దాడులు పెరిగాయన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నియోజకవర్గం అంతా సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు జరుగుతున్నాయని, ఈ పాదయాత్రలో మోదీ విధానాలను ఎండగడుతున్నామని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం మార్చుకోకపోతే మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు చేస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నర్రా రమేష్, భద్రం, కె. వెంకన్న, వాసు, హుస్సేన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ



విద్యార్థి సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రామాచారి

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు, హస్నాబాద్, మేడిదపల్లి పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి బీవీ రామాచారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాల సాధనను, విద్యార్థుల అభివృద్ధిని పరిశీలించారు. అంతేకాక ఆయా పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమాలను పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా తిరుమలాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పది విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎదుళ్లచెరువు సర్పంచ్ బైర మౌనిక, ఖమ్మం 04 స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిల్స్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి మాధవి, వార్డు సభ్యులు కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని రామాలయం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం, రోటరీనగర్ సబ్‌స్టేషన్, రఘునాథపాలెం మండలం వీవీపాలెం సబ్‌స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్–5 ఏఈ ప్రభాకర్, అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమాన్‌బజార్, కస్బా బజార్, వల్లాల వీరి వీధి, షాదీఖానా ప్రాంతం, స్టేషన్ రోడ్, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్ ప్రాంతం, వినోద థియేటర్ ఏరియా, ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ ఏరియా, ఖిలా, శుక్రవారిపేట, బ్రాహ్మణ బజార్, రిక్కా బజార్, చర్చి కాంపౌండ్, రామకృష్ణ నగర్, సుగ్గలవారి తోట, మేదర బజార్, అమ్మ భవాని దేవాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా, రోటరీనగర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, వీవీపాలెం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీంతో రోటరీనగర్, ఇందిరానగర్, గోపాలపురం, అల్లీపురం, పుట్టకోట, పోలీసుకాలనీ, శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్ 1 నుంచి 16 వరకు, జీఆర్‌ఆర్ శ్రీనివాసం కాలనీ, బ్లూసేవ అపార్ట్‌మెంట్, వీవీపాలెం, గణేశ్వరం, వేపకుంట్ల, చింతగుర్తి తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

'సత్య సాయి' సేవలు ప్రశంసనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్సై స్రవంతి

నేలకొండపల్లి: సత్యసాయి సేవా సమితి సేవలు ప్రశంసనీయమని నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్న సమితిని ప్రత్యేకంగా అభినందించి, ప్రజాహిత కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, సర్పంచ్ రాయపూడి నవీన్, సమితి సభ్యులు వెంకటరమణ గుప్తా, దోసపాటి శేఖర్, జగన్‌మోహన్‌రావు, కడియాల నరేష్, దోసపాటి శేఖర్, బల్లి వీరయ్య, కొత్త రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ ప్రతిపాదనలు సరికాదు..

ఖమ్మంలీగల్: తెలంగాణ బార్ కౌన్సిల్ రూపొందించిన ప్రతిపాదనలు న్యాయవాదులు, కక్షిదారులపై భారం మోపేలా ఉన్నాయంటూ జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. శుక్రవారం కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. వెల్ఫేర్ టికెట్ రూ.100 నుంచి రూ.200, సివిల్, క్రిమినల్, మధ్యంతర పిటిషన్లకు అదనంగా రూ.20 పెంచాలని ప్రతిపాదించడం సరికాదన్నారు.బార్ కౌన్సిల్‌పై పడుతున్న భారాన్ని న్యాయవాదులపై మోపకుండా ఉండేందుకు ఏడాదికి రూ.10 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి కౌన్సిల్ సభ్యులు చేసిన విజ్ఞప్తిపై నిర్ణయం వచ్చేవరకు ఈ ప్రతిపాదనలపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు తెలంగాణలోని అన్ని బార్ అసోసియేషన్లతో చర్చించి మెజార్టీ నిర్ణయం ప్రకారమే వాటిని అమలు చేయాలని కోరింది. ఈ సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, వి.కృష్ణమూర్తి, జహీర్ అలి, బిచ్చాల తిరుమలరావు, శ్రీరాంరావు, తాళ్లూరి దిలీప్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

విచారణ చేపట్టాలి

ఖమ్మంసహకారనగర్: మైనార్టీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవలపై విచారణ చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏళ్ల కాలం నుంచి ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించకపోవడం వల్లే సబ్సిడీ రుణాలకు మైనార్టీలు అత్యధిక దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. 40 యూనిట్లకు 2,915 దరఖాస్తులు వస్తే అందర్నీ ఇంటికి పంపించి కొద్ది మంది సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఖమ్మం నియోజక వర్గ పీసీసీ సభ్యుడు మహమ్మద్ జావేద్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముజహిద్ హుస్సేన్, నగర మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్బాస్ భేగ్, నగర మైనార్టీ నాయకులు షేక్ వసిం, మహముద్ తదితరులున్నారు.

సీపీఆర్‌తో ప్రాణదానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆకస్మిక గుండె పోటు వ్యక్తులకు సీపీఆర్‌తో ప్రాణదానం చేయొచ్చని ఆర్టీసీ వైద్యుడు గిరిసింహారావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఖమ్మం డీఎం శ్రీనివాస్, సీఐ రామయ్య, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీర వనిత సావిత్రీబాయి పూలే..

సమాజంలోని దురాచారాలు, మహిళలపై నిర్బంధ కట్టుబాట్లను ఎదిరించి.. స్త్రీలను చైతన్య పరిచిన వీర వనిత, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా బీసీ సంఘాలు, బీఆర్ఎస్ పార్టీ, ఎల్‌హెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆమె విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘ సంస్కర్తగా, తొలి ఉపాధ్యాయురాలుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి: పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు



కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో నివాళులర్పిస్తున్న నాయకులు